# సర్వంజగన్నాథం

శ్రీ కొడవటిగంటి కృష్ణమూర్తి

"ఏమండోయి! ఎప్పుడు రావటం ?"

"ఇప్పుడే! ఈ రైలుకే – చూస్తునే వుంటిరిగా! – ఏమిటి విశేషాలు ?" అన్నాడు. వి. మిత్ర (విశ్వామిత్ర) మొహంమీద పడ్డ ముంగురులలోనుంచి చూస్తో కౌశికుడితో. అతని చేతుల్లో ఒకదాంట్లో సూటుకేసూ, రెండోదాంట్లో హోల్డాలూ వుండటంవల్ల అతనికి ఆ ముంగురులను పైకి తోయ్యటానికి అవకాశం లేకుండావుంది. తెల్లని చొక్కాలాల్చీ, ఇంకా తెల్లని పంచె గూడకట్టూ, నుదుటిమీద చిరుచెమటా మొత్తం మీద అంతా కలిపి ఎలా వుండాలో అలా—ప్రయాణంచేసి అప్పుడే రైలుదిగిన ఆర్టిస్టుకుమల్లేనూ—కనీసం కొంతమంది ఆర్టిస్టులు వుంటున్నట్టుకాని, లేక వుండాలనుకుంటున్నట్టుగాని వున్నాడు. వి. మిత్ర ఆర్టిస్టు. ఆమాటకొస్తే కౌశికుడూ ఆర్టిస్టే! అయితే, మిత్రగారిని అధమం అయిదారుగురన్నా ఎగతాళిధ్వని లేకుండా "ఆర్టిస్టు" అని తమ స్నేహితులకు తెలియనివారికి పరిచయంచేసేవారున్నారు. "మిత్రకేమండీ అతను ఎలాగన్నా ఆర్టిస్టు!" అనేవారు ఇద్దరన్నా వున్నారు. కౌశికుణ్ణి ఇతరు లెవ్వరూ "ఆర్టిస్టు" అని అనరు ఎగతాళిగా తప్పనూ, కన్ను కొట్టకుండానూ! కౌశికుడికి ఈ సంగతి తెలియకపోలేదు. అయితే, ఇతరు లెవ్వరూ తన్ను ఎగతాళిగా తప్ప "ఆర్టిస్టు" అని పిలవటంలేదని తనకు తెలుసనని ఇతరులకు-అతనికి జ్ఞాపకం వున్నంతవరకూ-ఎవ్వరికీ తెలియనివ్వలేదు. కాని, ఈసంగతి. ఈ రహస్యం గమనించినవారు ఇద్దరుముగ్గురున్నారు! ఇట్లా తనసంగతి సంపూర్తిగా ఇద్దరు ముగ్గురికి తెలుసునన్నసంగతి కౌశికుడు గమనించినటువంటివాడై వాళ్లమట్టుకు లేకుండా చూచి ఎవరన్నా తనను "మీరూ ఆర్టిస్టులుగా!" అన్నప్పుడు అతను చిఱునవ్వు నవ్వి "ఆ! నాబొంద!" అనటంకూడ కద్దు!

ఈ దరిద్రానికంతకూ తనే కారణం అని కౌశికుడి అనుమానం. తను ఒక్కమాట ఒకసమయమున అనకుండా వున్నట్టయితే మిత్రగారు ఎక్కడ వుండే వారు? చల్లనిగాలివీస్తున్న సమయంలో, సంధ్యారాగంలో, ప్రకృతికౌగిలింతలో వొళ్లుమరచి కౌశికుడు ఏదో వాగ్వాదంలో మిత్ర కొత్త "ఆర్టిస్టు" అన్నాడు కౌశికుడు ఎవ్వరూ అతన్ని కాదనకపోవటంవల్ల అతని కప్పుడు తొందరపడి అంత కాంప్లిమెంటూ ఇచ్చినందుకు కౌశికుడికి విచారంకలగలేదు. అసలు అప్పుడే ఆవిషయం అంతటితో అంతరించిపోయింది. కౌశికుడికి కూడ ఇది జ్ఞాపకానికి వచ్చేదికాదు! ఏడెనిమిదినెలల్లో నలుగురైదుగురు వి. మిత్రను ఆర్టిస్టు అని ఏదో సమయంలో అనటం విని జరిగినట్రాజెడీ అంతా స్ఫురణకు వచ్చింది! డ్యూక్ ఆఫ్ విండ్సరు కొన్ని సంవత్సరాల కిందట పారిస్‌లో ఒకహోటల్లో బదులు ఇంకో హోటల్లో నివసించినట్లయితే ౧౯౩౬ డిసెంబరు ౧౨-వ తారీకున కని విని ఎరుగని త్యాగం ప్రేమకోసం జరిగేదికాదు! అంత చిన్న ఆవగింజంత విత్తనంలో నుంచి ఎంతమర్రిచెట్టంత ఘోరం జరిగింది! చరిత్రలో ఇటువంటి ట్రాజెడీలు ఎన్నిలేవు? అవన్నీ ఎంత తన జీవితంలో స్వల్పకాలంలో తను చూస్తుండగా జరిగిన ట్రాజెడీముందు? ఓరాజు సామ్రాజ్యాని త్యాగంచేస్తే తన కేమిటి పట్టింది దాని ఫలితం? కౌశికుడు ఎప్పుడూ తన కళ్లతోనే చూస్తాడు. ఇప్పుడు వి. మిత్ర ఆర్టిస్టు కాదని ఒకడిచేత అనిపించటంగాని, రుజువుచెయ్యటంగాని – మరీ విచారకరమైన విషయం ఏమిటంటే అతన్ని నిజంగా ఆర్టిస్టును కాకుండా చెయ్యటం అయినా సరేకాని కౌశికుడితరం కాదు; పోయింది తన చేతుల్లోనించి జారిపోయింది.

కౌశికుడికి ముఖ్యంగా పట్టుకున్న దేమిటంటే అందరూ మిత్రను ఆర్టిస్టు అంటున్నారనికూడా కాదు!

తనను అనరేమని! తనుకూడ ఆర్టిస్టయి నంతకాలం ఇతరులెవరైనా అది అయినప్పుడు అతనికి అభ్యంతరంలేదు. మిగతా అన్ని విషయాలల్లోనూ తను పైచెయ్యికాకపోయినా మిత్ర తనూ ఇంతవరకు సమానంగానే ఉన్నట్టు కౌశికుడి అనుమానం! కాని వెధవది ఈవిషయంలో మిత్ర ఒక మెట్టుపైన వున్నాడు. అదైనా తన ఖర్మే!

తన హృదయం దాచటానికి కౌశికుడు ప్రయత్నం చెయ్యలేదు. ఆవిషయానికి వస్తే తను ఎన్నడూ ఎరగనివారినికూడ అతను నిస్సంకోచంగా వారి ఎదటే ఇది అది అని లేకుండా అనేవాడు. వాళ్లు ఇతన్ని బొత్తిగా ఎరగకపోవటంవల్ల చిన్నబుచ్చుకునేవారు. ఎవరైనా మొండివాడు "ఏమిటయ్యా అలా అంటున్నావు?" అని అడిగితే "నలుగురం కలిసి మాట్లాడుకుంటున్నప్పుడు ఆమాత్రం అనుకోకపోతే ఎలాగు? ఇలా అయితే మీరు సంఘంలో ఎలా జీవించగలరు?" అనేవాడు. ఆ మొండివాడు అంతటితో వెధవ మొహం వేసి నిజంగా సంఘానికి కట్టుబడి (లేకపోతే చచ్చేవాడేమో!) వుమ్మేసి లేచిపోయేవాడు. కౌశికుడు వున్న సంగతి వున్నట్టుగా అనటం తన కొక్కడికీ ధైర్యం వున్నది అని తను అనుకోటమే కాకుండా ఇతరులతో చెప్పేవాడు. "ధైర్యం గాదు నీబొంద!" అని ఇతరులు అనుకునేవారు.

అలాగే కౌశికుడు మిత్రమీద విధ్వంసకప్రచారం మొదలుపెట్టాడు. మొదట ఒక్కక్కడితోనే మిత్ర అసలు ఆర్టిస్టే కాదని చెప్పేవాడు. అలా మొత్తంమీద తనకు తెలిసినందరితోనూ విడివిడిగా అనేవాడు; తనకు తెలియనివారితో సందర్భంగా గాని అసందర్భంగా గాని అనకపూర్వం. అతను ఇలా జాగ్రత్తపడటానికి కారణం ఎవడైనా పుటుక్కున "ఇదివరకు మొదట నువ్వే అతణ్ణి ఆర్టిస్టుఅంటివిగా" అనిఆశ్చర్యపోతారేమో నని అతని భయం! కాని ఒక్క దౌల్బాజీ కూడ ఆవూసే ఎత్తకపోవటంవల్లనూ, కనీసం ఒక్కరైనా కౌశికుని మీద నువ్వు చెప్పేది నిజంగా నిజమేనా అన్నట్టు అనుమానంగాకూడ చూడనైనా చూడకపోవటంవల్లనూ, అతఃకి ఈవెధవకు ఒక్కడికీ జ్ఞాపకం లేదు అని గమనించి, ధైర్యం తెచ్చుకుని ఇద్దరు ముగ్గురు కలిసివుంటున్నప్పుడుకూడ ప్రచారం మొదలుపెట్టాడు. అతని కెవ్వరూ అడ్డు చెప్పలేదు. చివరకు పదిమందిలోనూ అన్నాడు. తర్వాత అనేకసార్లు కనీసం మిత్ర ఆర్టిస్టుకాదు అన్నభావం స్ఫురించేటట్టయినా అన్నాడు. ఎవ్వరూ అతన్ని (మిత్రను) ప్రత్యేకంగా అనవసరంగా అసందర్భంగా ఆర్టిస్టు అని అనకపోయినా కౌశికుడు ప్రచారం మానలేదు! మొదట అతనికి అనుమానం వేశేది ఎవరైనా తను ఇలా అంటున్నట్టు మిత్రకు చెపుతారేమో అని. కాని అతను ఎన్నాళ్లు గమనించినా ఆవాసనేమీ వెయ్యలేదు!

ఎవడో దారితప్పి వచ్చి అనేవాడు "మిత్రగారు తెలివిగలవారండీ!" అని. "నువ్వు తెలివిగలవాడివి కాదూ? నీ కేం తెలుసు!" అనేవాడు కౌశికుడు. అవతలవాడు వెధవ మొహంవేసి "కాదు లెండి! ఎట్లాగైనా-" అని అనకపూర్వమే "మే మంతా ఒకటే! ఒకరు ఎక్కువా లేదు ఒకరు తక్కువా లేదు. నీ కసలు ఈ విషయాలు ఏమీ తెలియవు బోలెడు గ్రంథం వుంది!" అని కౌశికుడు వాడిని తన్ని తగిలేశేవాడు. వాడు ఎవడికి నిజంగా తెలియదో నిజంగా తెలుసుకుని అప్పుడప్పుడు మర్యాదగా వెళ్లిపోవటం కూడ కద్దు!

కొన్నాళ్లయినతర్వాత కౌశికుడు నిర్ధారణకు వచ్చాడు తను మిత్రతో ఎక్కువగా మాట్లాడ నక్కర్లేదని. కాని ఏమిషమీద అకస్మాత్తుగా తెగతెంపులు చేసుకుంటాడు. అతను కనపడ్డప్పుడల్లా అతనంతట అతను తనను పలకరించకపోయినప్పటికీ తనే అతన్ని ఏదో పలకరించాలిసి వచ్చేది. ఏమీ లేకపోతే "వీళ్లంతా వట్టిమూఢులు! వీళ్ల కేమీ తెలియదు?" అనేవాడు. మిత్రకు అర్థంకాక "ఎవరికి ఏమిటి తెలియదు?" అని ప్రశ్నించేవాడు. కౌశికుడు ఏమీ చెప్పలేక "వీళ్లే! ఎట్లా మాట్లాడాలో తెలియదు. వట్టి — ఏమిటో — — అనాగరికత!" అనేవాడు. మిత్రకు ఇంకా అర్థం కాక విషయం ఏమిటో తెలుసుకోటానికి వోపిక లేక వూరుకునేవాడు. కౌశికుడు త నామాటలు ఏవుద్దేశ్యంతో అన్నాడో తనకే తెలియకపోయినప్పటికీ మిత్రమాట్లా

డకపోవటంవల్ల అతనికి అర్థమయింది అనుకునేవాడు! కొన్నిసార్లు మిత్రతో "వీళ్ల కేమీ తెలియదు." అన్న తర్వాత వీళ్లకేమీ తెలియనిది మిత్రకాదనీ, తనే మొదట అతని కాబిరుద మిచ్చాడన్న సంగతీ ఎందుకు కాకూడ దని అకస్మాత్తుగా తట్టింది! అప్పటినుంచి "వీళ్లకేమీ తెలియదు" అన్నప్పుడల్లా అతని మనస్సులో ఆ అభిప్రాయమే వుంటుండేది! ఇలా కొంతకాల అయిం తర్వాత తనే మిత్రను మొదట ఎందుకు పలకరించాలనీ, అతనే మొదట తనను ఎందుకు పలకరించకూడ దనీ ఆలోచన గలిగింది. ఒకరోజున ఇద్దరూ బజారులో ఎదురుపడ్డారు. కౌశికుడు మిత్రను పలకరించకుండా వెళ్లిపోతున్నాడు. మిత్ర అతనితో మాట్లాడటం అయినతర్వాత ఎలా వెళ్లిపోయేవాడో అలాగే వెళ్లిపోయినాడు ఇప్పుడు మాట్లాడకపోయినప్పటికీ ! ఇలా రెండుసార్లు జరిగింది. కౌశికుడికి ధైర్యం చాలలేదు. తనే ముందర అతనితో మాట్లాడటం తప్పు అని తెలుసుకున్నాడు ! తర్వాత రెండుమూడుసార్లు మామూలుగానే మాట్లాడుకున్నారు. మిత్రలో ఏమీ మార్పు కౌశికునికి కనపడలేదు. కాని కౌశికుడికి అవస్థ దురవస్థ అయింది. తనకు అతనితో అనవసరంగా మాట్లాడటం ఇష్టం లేదు. అది మొదటి పాయింటు. అతను తనంతట తాను తనతో ఏవిషయమూ ముందర మాట్లాడడు. ఇది రెండో పాయింటు. అతను తనతో మాట్లాడా లనికూడ తనకు ఇష్టం లేదు. మూడో పాయింటు. ఈమూడుపాయింట్లు స్పష్టంగా తేలినప్పటికీ తను అతనితో ఎందుకు మాట్లాడక తప్పకపోవటం? కౌశికుడికి ఆశ్చర్యం కలిగింది. మిత్ర అడిగితే సమాధానం చెప్పుతాడు. అదయినా చాల క్లిష్టంగా వుంటుంది. అంతకంటె అతనేమీ చొరవచేసుకుని తనఅభిప్రాయాలను అందరికీ చాటి బాధించడు. చివరకు కౌశికుడు మిత్రమొఖం తప్పించటం మొదలుపెట్టాడు. అతన్ని దూరంగా చూడగానే పక్కరోడ్డున పోవటం, అతను వస్తేలేచిపోవటం, అతను వున్నచోటికి తను వెళ్లకపోవటం సక్రమంగా జరుగుతున్నాయి. కాని అతని మనస్సుకు విశ్రాంతి కలుగలేదు. తను అతన్ని తప్పించుకు తిరగటంగా వుందికాని అతను తన్ను తప్పించుకు తిరగటం లేదు! త నున్నచోటికి వస్తాడు. తను లేచిపోవలిసి వస్తున్నది!

ఎవ్వరూ కౌశికుణ్ణి అడగలేదు నువ్వుమిత్రతో ఎందుకు మాట్లాడటంలేదని! కాని కొంతకాలం అయిం తర్వాత ఒకపింజారి కౌశికుణ్ణి "మాట"! అని తీసికెళ్లి "అయితే నువ్వూ మిత్రా మాట్లాడుకోరా ఏమిటి?" అని అడిగాడు. "ఎబ్బే అదేంలేదే! అత నేమన్నా అలా అన్నాడా?"అని అడిగాడు. తర్వాత నలుగు రైదుగురు అతన్ని ఈ విధంగానే అడిగారు. పులిపోయి పుట్ర వచ్చిందని అతనికి ఈబాధ ఎక్కువ అయింది! ఒకరోజున పదిమందిలో ఒకడు అదేప్రశ్న ఇతన్ని వేశాడు. "అందరూ నన్ను అడుగుతారేం? అతన్ని ఎవ్వరూ అడగరేం?" అన్నాడు పట్టలేక. అతని వుద్దేశ్యం ఇలా పదిమందిలో ఒక్కసారి చెప్పితే తనను అడగరు కదాఅని ధైర్యం! కాని వారెవరూ ఇతనికి చెవిఇచ్చినట్టులేదు. ప్రశ్నించినవాడు ఒక్కఅరనిమిషం ఇతని వంకచూచి పక్కవాడివంక చూచి నవ్వాడు — "నేను ఇదివరకు కౌశికుడు పైత్యకారి అని చెపితే నువ్వు నమ్మకపోతివే. ఇంతకంటె ఇంకా ఏమిదాఖలా కావాలి?"అన్నట్టుగా!

మొత్తంమీద కౌశికుడూ మిత్ర అంతకంతకు దూరం అయిపోయినారు కౌశికుడిదృష్టిలో. ఇద్దరూ రోడ్డుమీద కలుసుకున్నప్పుడు కౌశికుడు తలవంచుకుని మాట్లాడకుండా వెళ్లిపోవటం జరిగేది. క్రమేపి అది చివరకు మామూలుగా కౌశికుడు తల ఎత్తుకునే మిత్రతో మాట్లాడకుండా ధైర్యంగా వెళ్లిపోవటంవరకు వచ్చి అట్లాగే సాగిపోతున్నది. కాని రోడ్డుమీద మిత్రను కలుసుకున్నప్పుడూ, అతను తనవంక చూడకుండా వుండటం చూచి చిన్నప్పటినుంచీ కష్టపడి చదువుచెప్పి పెద్దవాడిని చేసి ఆకుర్రాడు కాలేజీలో ప్రవేశించి దశరా శెలవులకు స్వగ్రామం చేరి తను కనపడగానే నమస్కారం చెయ్యకపోగా అసలు "ఏమండోయి! మేష్టారుగారు!" అనన్నా పలకరించని విద్యార్థిని అతను దాటిపోయినప్పటికీ ఎలా చూస్తూచూస్తూ — ఒకవేళ పొరపాటున చూడక పోవచ్చునని వూహించుకుని తర్వాత చూచైనా పలకరిస్తాడేమోనన్న ఆశతో- ఆవిద్యార్థి మేష్టరు ఎలా పోతాడో అలా మిత్రవీపు

ళంకచూస్తూ కాశికుడు రోడ్డుమీదవస్తున్న రెండెడ్ల బండీ కెదురుగా పోతుండేవాడు. అతన్ని "ఆర్టిస్టు"ను చేసింది తను కదా అని అతన్ని చూచినప్పుడల్లా కాశికునకు జాపకం వచ్చేది.

మిత్రతో పూర్తిగా సంబంధం లేక పోయినప్పటికీ కాశికుడికి మనశ్శాంతి లభించలేదు! తనకు తృప్తి కలిగేటట్టుగా విడిపోలేదు అతనితో సంబంధం. ఏవిధంగా అయితే తనకు తృప్తికలుగుతుందో తనకే తెలియదు! ఏవిధంగానన్నా కాని తనకూ మిత్రకూ సంబంధం లేకపోవటానికి తప్పంతా మిత్రదే అయి అందరూ అతన్నిఅంటే కాశికుడికి బహుశా మనశ్శాంతి కలుగుతుందేమో!

ఇంతలో మిత్ర ఫీలింలోకి వెళ్లిపోయినాడు! అతను వెళ్లేటప్పుడు ఎవ్వరితోనూ చెప్పలేదు. పది రోజులు కనపడకపోగానే కాశికుడికి తృప్తి కలిగింది. చాటుగా అందర్నీ అడిగేవాడు మిత్ర ఏమైనాడని. ఎవ్వరూ అతనికి సమాధానం చెప్పలేకపోగా తిరిగి ఇతన్నే ప్రశ్నించటం మొదలుపెట్టారు. ఒక రోజున నలుగురిలోనూ ఈప్రశ్న వచ్చింది. ఎవడో ఫిలింలోకి వెళ్లాడని వూదాడు. "వట్టిది! అన్నీ వట్టిది!" అని అరిచాడు కాశికుడు! వట్టిదని నీకెట్లా తెలుసు? అని అడిగా డోవత్స. "నిజంగా సినిమాలోకి వెళ్లివుంటాడా? ఇతన్ని ఎవరు తీసుకెళ్లుతారు? దేనికి తీసుకెళ్లుతారు? ఇతని కేమి చేతనవును అని? సినిమా అంటే మాటలా? ఎంతో అనుభవం వుండాలి!" అని తేల్చాడు కాశికుడు. అక్కడ మొత్తంమీద ఏమీ తేలలేదు. మిత్ర ఎక్కడికి కెళ్లాడో, ఎందుకు వెళ్లాడో ఎవరికీ తెలియలేదు. ఫిలింలోకి వెళ్లాడన్నవాడిని మళ్లీ అడిగితే నచ్చాడు. వారంరోజుల్లో అందరికీ స్పష్టంగా తెలిసింది. మిత్ర ఒక ఫిలింకంపెనీట్రూపుతో కలకత్తా చేరాడని!

"అదీ సంగతి! అందుకనే ఎవ్వరితోనూ ఏమీ చెప్పేవాడుకాడు!" అన్నాడు కాశికుడు. మిత్ర లేచిపోవటం ఇతనికి ఇష్టమేకాని కలకత్తా లేచిపోవటం కాని, ముఖ్యంగా ఫిలింట్రూపుతో లేచిపోవటం కాని ఇతనికి ఎంతమాత్రమూ ఇష్టంలేదు! తనకు ముందుగా తెలిస్తే అతను వెళ్లకుండా చెయ్యటానికి అవకాశం వుండేదేమోకాని ఇప్పుడుఅతన్ని అక్కడినుంచి తీసుకు రావటానికితప్ప అవకాశంలేదు! "ఇతను దేనికి ఫిలింలోకి?" అని అందర్నీ అడిగాడు. ఎవ్వరూ అతనికి తృప్తికరంగా జబాబు చెప్పలేదు. చాలమంది తెలియదన్నారు. కొంతమంది తెలిసినట్టుగా చెప్పబోయి మధ్యలో ఆగారు. కొంతమంది నీకే తెలియకపోతే మాకేం తెలుస్తుంది? అన్నారు. వారంరోజులు విశ్వప్రయత్నం చేశాడు. అతనికి నలుసంత ఆచూకీ అయినా చిక్కలేదు. వారాలు, నెలలు గడిచిపోయినవి. ఫిలిం బయటికి రాదు! మిత్రసంగతి తెలియలేదు. మిత్రను తీసికొని వెళ్లింతరువాత ఆఫిలింబైట కెలా వస్తుందని కాశికుడు లోపల అనుకున్నా బైటికి అనటానికి ధైర్యం లేకపోయింది. కారణం ఏమిటంటే ఫిలింనుగూర్చి మిత్రరాసిన కొన్ని వ్యాసాలు పత్రికలలో అచ్చుపడటంచూచి కొంతమంది ఇతని మనస్సు కష్టపడుతుందని శంకకూడ లేకుండా మిత్రను స్వల్పంగా అభినందించటం మొదలుపెట్టారు! ఇదంతా మొత్తంమీద ఆరునెలల్లో అడవిగోడుగా తేలింది. కాశికుడికి ఏమీ అర్థంకావటంలేదు. పరిస్థితులు విషమించేటట్టున్నయి. ఒకర్ని అని ఏమిటిలాభం అసలు కారణం తను అయినప్పుడు!

ఇటువంటి స్థితిలో కాకికడ వూరికి వెళ్లుతూ మొదటి పదిమెట్లు ఎక్కిచూడగానే ఎదురుగ్గా మిత్ర తయారు. కాశికుడు నివ్వెరపోయినాడు. అసలు మామూలుస్నేహితుడే అకస్మాత్తుగా అట్లా కనపడితే ఆశ్చర్యపోతాం. అటువంటప్పుడు తనకు అనేక రాత్రులు నిద్రలేకుండాచేసిన వ్యక్తి, ప్రతిక్షణం తననే తలచుకునేలాగ చేసినవ్యక్తి చాలకాలం అయింతరువాత అకస్మాత్తుగా కనపడితే! మిత్ర వస్తున్నాడన్న సంగతి తెలిస్తే ఇంత గాభరాపడడు. అదివరకల్లా తన మనస్సులోవుంటూ ఆక్షణంమట్టుకు తనమనస్సులో లేని వ్యక్తి ఒక్కక్షణంలో కనిపించగానే కాశికుడి మతి ఎగిరిపోయింది. తను అతనితో మాట్లాడకపోవటం మరిచిపోయినాడు. అతను తనతో ఎక్కడికి వెళ్లుతున్న సంగతీ చెప్పకుండా వెళ్లటం మరిచాడు. తన్నెవ్వరో గొడుగుపెట్టి పొడుస్తున్నట్టు అతనికి తెలియనే తెలియదు.

మిత్రవెనకే జనం వీళ్లిద్దరూ మెట్లకు అడ్డం నిలుచోటం వల్ల నిలబడిపోయినట్లు ఇతనికి కనిపించలేదు. ఒక్క క్షణం అతని అవయవాలన్నీ పనిచెయ్యటం మానేసి నాయి.

మరుక్షణం వెకవకనవ్వు నవ్వి "ఏమండోయి ఎప్పుడు రావటం?" అని అడిగాడు. మిత్ర సమాధానం చెప్పాడు. ఆమరుక్షణం కౌశికుడికి అన్నీ జ్ఞాపకానికి వచ్చాయి. కాని ఇప్పుడు లాభం లేదు. ఈపరిస్థితులలో తను ముందరికి పోవటం తప్ప గత్యంతరం లేదు.

## ౨

నేను కాఫీ తాగి వెళ్లిపోబోతుండగా ఎవరో నాచొక్కా పట్టుకున్నారు. వెనక్కు తిరిగాను.

"ఏంరోయి ఎప్పుడు రావటం!" అన్నాను ఆశ్చర్యంతో. మిత్ర నవ్వుతూ నిలబడివున్నాడు.

మిత్ర మారుమాట్లాడకుండా నా చెయ్యి పుచ్చుకుని పక్కనన్నగుర్రబ్బండి ఎక్కుమన్నాడు. బండి మీద వాడింటికి చేరాము. అంతవరకు నే నేమీ మాట్లాడలేదు. ఇంటి కిచేరింతరువాతమట్టుకు అడిగాను సంగతు లేమిటని.

"అయితే నేను వెళ్లి ఎన్నాళ్లయివుంటుంది ఈ వూరునుంచి?" అన్నాడు మిత్ర.

"ఎనిమిది నెలలు దాటింది"." అన్నాను నేను.

"నే. నే మన్నా మారానా?"

"క్లాస్సైపున్న తర్వాత చెపుతాను!"

"చూపులకోయి!" అన్నాడు మిత్ర.

"చూపులకు మారినా ఒకటే మారకపోయినా ఒకటే!"

"అయితే ఈవూళ్లో ఏమన్నా మార్పులు జరిగినయా?"

"నీ కట్లా కనపడుతున్నది?"

"నాకేమీ కొత్తకనపడటంలేదు. మనవాళ్లంతా ఎలావున్నారు?" అనిమిత్ర నలుగురైదుగుర్ని విచారించాడు. నేను చెప్పాను.

"అయితే మన కౌశికుడు మరీ అన్యాయంగా తయారవుతున్నాడే?" అన్నాడు మిత్ర బిక్కమొహంతో.

"ఏం? నీ కప్పుడే కనపడ్డాడు?"

"తమాషా ఏమిటంటే అతను ఎప్పుడు నాతో మాట్లాడుతాడో నాకు తెలియదు. అతనికికూడ తెలియదు అనుకుంటాను! నేను కనపడినప్పుడు అప్పటి కప్పుడు నిర్ధారణ చేసుకుంటా డనుకుంటాను నాతో మాట్లాడాలిసిందీ లేనిదీ!"

"ఏం?"

"నే నీవూరినుంచి వెళ్లకపూర్వం మాట్లాడటం మానేశాడు—

"కారణం"

"అతనికే తెలియాలి. పోనీ పీడ విరగడయింది కదా అనుకున్నాను. కారణం ఏమిటంటే అతను నాతో ఎప్పుడు మాట్లాడినా నాకు అర్థం అయ్యేది కాదు. అతనికి అన్నివిషయాలలోనూ అనుమానా లున్నట్టున్నయి. అవి తీర్చమని అప్పుడప్పుడు నన్ను అడుగుతున్నాడేమోనని అనుకుంటుండేవాడిని. కాని అతని ప్రశ్నకు వెంటనే అతనే సమాధానం చెప్పుకునేవాడు! నేను చూస్తూ అతని ధోరణి వింటూవుండాలిసి వచ్చేది. నాలుగైదు ప్రశ్నలు వేసి అతనే నాలుగైదు సమాధానాలు చెప్పుకున్నతర్వాత మాసంభాషణ అంతం అయ్యేది! ఆప్రశ్నలకు సమాధానం అతనికి నా మొహం చూస్తేగాని తోచదుకామోసు! మాకు ఇంకో రకం సంభాషణ లేనిదే! అలాంటివాడు వదిలాడు గదా అని మురుస్తున్న సమయంలో ఇవాళ రైలు దగ్గిర నన్ను ఈ ఎనిమిదినెల్లవారా తోమాడు!"

"ఏం? ఏం జరిగింది?" అన్నాను నేను.

"అతను నాతో మాట్లాడుతుండగా నువ్వు విని తీరాలి! కడంవాళ్లతో అట్లా మాట్లాడుతాడో లేదో తెలియదు. కాని నేను ఆరకం సంభాషణ ముప్ఫై సెకండ్లకంటె భరించలేని దీనస్థితిలో వున్నాను. అటువంటి సమయంలో పదినిమిషాలు ఇవాళ నరకం అనుభవించాను."

మిత్రగొంతు తనెంత బాధపడ్డాడో విపులంగా చెప్పలేనంత దీనంగా వుంది.

"నువ్వు చెప్పేది నాకు ఆశ్చర్యంగా వుంది." అన్నాను నేను.

"అతను మాట్లాడేవిషయాలు అతనికి అవసర మున్నట్టు తోచదు సరే, నాకూ అవసరంలేదు అని చెప్ప నవసరంలేదు. నాకు అర్థంకూడ కావవి. అతనికి కూడ అర్థంకావని నాగట్టి విశ్వాసం!"

"నాకు వుదాహరణ చెప్పు!"

"తను చిన్నప్పటినుంచీ ఎంతో చదివి విజ్ఞానం సంపాదించాడట!"

"అంటే?"

"ఏమో? మళ్లీ ఆవాక్యానికి సంబంధం వున్న వాక్యం ఇంకోటిలేదు. తర్వాత పత్రికవాళ్లు ఎప్పుడు డబ్బిస్తారు అన్నాడు. ఏపత్రికో తిన్నగా చెప్పడు. ఎందుకు డబ్బియ్యాలో చెప్పడు!"

నాకు నవ్వాగలేదు.

"అతను ఓవారంరోజుల కిందట పత్రికలో ఫిలింలనుగురించి ఒకవ్యాసం రాశాడు. పత్రికవాళ్లు డబ్బిస్తారని అతని కెవరో చెప్పారు. వూళ్లో అందరినీ అడగటం మొదలుపెట్టాడు. నిన్నూ అడిగాడు. నువ్వు సమాధానంచెప్పాలని కాదు అతను నిన్ను అడిగింది. నువ్వు 'ఎందుకు డబ్బియ్యాలి పత్రికవారు' అని అడిగావా?"

"అడగలేదు! నాకు ఓపిక లేదు!"

"ఇసుక తక్కెడిగాడు, పేడ తక్కెడిగాడు! నువ్వు అది అడిగినట్లయితే, ఆ నావ్యాసం ఒకటి పడ్డదిలే! అనేవాడు. ఈ పరాభవం మాలో కొందరి కయింది!" అన్నాను నేను.

"అదా సంగతి!" మిత్ర నిట్టూర్పు విడిచాడు. "అయితే అతను వేసిన ప్రశ్నల కన్నింటికీ ఎదో సమాధానం వుంది అన్నమాట. నేను చెప్పకపోవటం చూచి అతనే చెప్పుకుంటున్నా డన్నమాట. శ్రీరామ!"

"అతను మనస్సులో ఏదో ఒకవుద్దేశ్యం పెట్టుకునే నిన్ను అడుగుతుండివుండాలి! అయితే నువ్వు వెళ్లిన ఫిలిం ఏమయింది?"

"ఏంఫిలిం?"

"కలకత్తా ఏదో ఫిలింట్రూపుతో వెళ్లినావని అంతా అనుకుంటుంటే!"

"కలకత్తాకూడ వెళ్లినమాట నిజం. ఫిలింమట్టుకు నాకు తెలియదు."

"సరేలే! ఎదో ఫిలింలో పనిచేస్తున్నావని ఈ వూళ్లో పుకారు!"

"నేను కలకత్తాలో మెట్రోలో ఒక అద్భుతమైన టాకీ చూచాను. ఆసంగతి ఒకడికిమట్టుకు రాశాను. బహుశా అది అయివుంటుంది!"

"అయితే నువ్వు ఒకఫిలిం చూచానని వుత్తరం రాస్తే అది కాస్త నువ్వు ఫిలింలో పనిచేస్తున్నావని పుకారుగా మారిందంటావా?"

"అంతే అయివుండాలి. ఆవొక్క వుత్తరం తప్ప ఇంకోటి అసలు నేను ఎవ్వరికీ రాయనే లేదు!" నాకు ఆశ్చర్యం వేసింది.

"అసలు నువ్వు దేనికి వెళ్లావు?" మిత్ర రెండు నిమిషాలు ఆలోచించాడు.

"ఫిలిం చూచానని రాస్తే ఫిలింలో వుంటున్నానని అనుకునేవూళ్లో ఎట్లా వుండటం? నాకు ఈవూళ్లో జీవితం తృప్తికరంగా లేకపోయింది. నన్నెవ్వరూ ఎరగనిచోట బాగుంటుందేమోనని కలకత్తా చేరాను. మొదటి పదిహేనురోజులూ స్వర్గంలా వున్నది. ఆలస్యంగా భోజనం ఎందుకు చేస్తున్నావు అని అడిగిన వాడే లేదు. కాని పదిరోజులైనతరువాత హోటల్లో ప్రతివాడూ నే నెందుకు కలకత్తా వచ్చానో తెలుసుకోటానికి ప్రయత్నించటం జరిగింది ఇరవైరోజులైంతరువాత అక్కడినుంచి లేచి ఇంకోపట్టణం చేరాను. అక్కడా అంతే. ఎనిమిదినెలలు దిమ్మతిరిగింతరువాత నాకు మనవూరే నయమనిపించింది! ఇక్కడ బాధించే వారిని మనం కనీసం కసరికొట్టటానికన్నా అధికారం

వుంది ఎరిగి వుండటంచేత. తమాషా ఏమిటోగాని నన్ను అన్నిరకాల ప్రశ్నలు వేసేవారిని నేను రెండుమూడు ప్రశ్నలువేసి వాళ్ల సంగతికూడ తెలుసుకోవాలని ప్రయత్నిస్తే నవ్వుతూ చెప్పి మూడ్డోదానికి మాట్లాడనుకూడ మాట్లాడేవారుకారు. వారెందుకు మాట్లాడటం లేదో నాకు బాగా తెలుసు కనక అంతటితో ఆపేవాడిని. వాళ్లు మట్టుకు—"

"అయితే ఈవూరు వదిలిపెట్టి పోవటానికి కారణం ఈవూరే నంటావా?"

"ఈవూళ్లో నన్నెరిగినవాళ్లు! కాని నేను మళ్లీ ఈవూరు తిరిగిరాగానే కౌశికుడినిమాత్రం మొట్టమొదటే కలుసుకుంటానని కలలోకూడ అనుకోలేదు! నాకు భగవంతుడు తగినశాస్తి చేశాడు!"

"అయితే ముందు నువ్వు ఎలావుండా మనుకుంటున్నావు?" అన్నాను నేను.

"నాతో ఇతరులు ఎలా వుంటే నాకు తృప్తికరంగా వుంటుందో ఇతరులతో నేను అలాకలిసి మెలిసి తిరగదలిచాను! కొన్నాళ్లకయినా వీళ్లు నన్ను ఎలా చూడాలో అలా చూడకమానరు!"


## రాజమోహన హేరాయులు



శ్రేష్ఠమయిన సువాసన గల తలనూనె. మెదడుకు చల్లదనమును కలిగించి వెంట్రుకలను అభివృద్ధి చేయుటలో అత్యుత్తమ మయినది.

తలపోటు, కూడు పోటు, శిరోవేడిమి, చుండు మొదలగువాటిని పోగొట్టి కన్నులకు చలవ నొసంగి వెంట్రుకలను మృదువుపరచి, నల్లగా పెంచుటలో అత్యుత్తమ మయినది.

స్త్రీలకు ఆనందమును కలుగజేయును.

సీసా 1-కి రు. 0-12-0 6 సీసాలు రు. 4-4-0

పోస్టేజి ప్రత్యేకము.

పి. శి. ఏ. అండు కంపెనీ,
ఆయుర్వేదసమాజం,
పెరిదేపి, నెల్లూరుజిల్లా.



## చెవుడు

ఆద్భుతమైన క్రొత్తశాస్త్ర పరిశోధన




చెవులో చీము కారుట. పోటు, మంట, ధ్వని, దురద, చెమటకాయలు, చెవులో గుంయిమను ధ్వనివినబడుట, చెవిలోని ధ్వనిపొరలు సక్రమముగాలేక మాట సరిగా వినబడకుండుట, జ్వరమువలనగాని, క్వినైన్ సరిగావాడకపోవుటచేతగాని, కలిగిన కొంచెముగాని లేక పూర్తిగాని చెవుడు మున్నగునవి మా **బధిరతా హర్** తైలమువలన పూర్తిగా నెమ్మళించి, శబ్దము బాగుగా వినవచ్చుచున్నది. గుణము కన్పించనిచో సొమ్ము వాపసు చేయబడును. ఖరీదు రు. 2-0-0.

**AROGYA SADAN**
ఆరోగ్య సదన్, దుర్గాదేవివీధి, బొంబాయి 4